క్లుప్తంగా

భ్రమరాంబాదేవికి ఊయలసేవ



స్వామి అమ్మ వార్లకు ఊయల సేవ నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం అమ్మవారి మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజల అనంతరం అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. అనంతరం శ్రీశైలంలోనే అంకాలమ్మ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చేతి పంపులకు మరమ్మతులు



చేతి పంపుకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

పాములపాడు: ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచు వరప్రసాదరావు తెలిపారు. మండలంలోని తుమ్మలూరు గ్రామం పంచాయతీ, మజారా గ్రామం క్రిష్టారావుపేటలోని బీసీ కాలనీలో రెండు చేతి పంపులు పనిచేయకపోవడంతో మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకువచ్చామన్నారు. దీంతో ప్రజలకు నీటి సమస్య తీరిందన్నారు.

ఘనంగా రెవెన్యూ దినోత్సవం



సీనియర్లను సన్మానించిన తహసీల్దార్, కార్యాలయ సిబ్బంది

పాములపాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుభద్రమ్మ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సీనియర్ వీఆర్ఏ ముర్తుజా, రిటైర్డు జూనియర్ అసిస్టెంట్ రామసుబ్బయ్యను సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పఠాన్‌బాబు, రీ సర్వే డీటీ సుప్రియ, ఆర్ఐ ఖాజాబీ, మండల సర్వేయర్లు భాస్కర్, కలిముల్లా, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.


సన్మానం



డాక్టర్ ఝాన్సీని సన్మానిస్తున్న వైద్యసిబ్బంది

శ్రీశైలంప్రాజెక్ట్: ప్రకాశం జిల్లా చీమకుర్తికి బదిలీపై వెళ్తున్న శ్రీశైలంప్రాజెక్ట్ ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ డాక్టర్ పాల ఝాన్సీరాణిని శుక్రవారం వైద్య సిబ్బంది ఘనంగా సన్మానించారు. రోగులకు ఆమె అందించిన సేవలను కొనియాడారు. అనంతరం శాలువా కప్పి సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో డాక్టర్లు సంగీత, విజయలక్ష్మి, శ్రీకాంత్, యజ్ఞబ్రహ్మప్రసాద్, టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు వై.ఆశీర్వాదం, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆత్మకూరు: మండలంలోని సిద్దపల్లె గ్రామంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ కమిటీని ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ కమిటీకి రెడ్డిపోగు రమేష్‌ను, మహిళా కమిటీకి రెడ్డిపోగు కుమారిని, ఎంఎస్పీ కమిటీకి రెడ్డిపోగు నాగోషులు మాదిగను అధ్యక్షులుగా నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితుల హక్కుల కోసం నిరంతరం పోరాడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు ముంతన్న, దేవసహాయం, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ శోభాయాత్ర



ఛత్రపతి శివాజీ విగ్రహంతో శ్రీశైలంలో శోభాయాత్ర

శ్రీశైలం: ఛత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషేకం, హిందూ సామ్రాజ్య దినోత్సవం సందర్భంగా ఛత్రపతి శివాజీ శోభాయాత్ర నిర్వహించారు. శుక్రవారం శ్రీశైలంలో శివాజీ విగ్రహంతో ఊరేగింపు నిర్వహించారు. అలాగే శివాజీ స్ఫూర్తి కేంద్రం వద్ద బహిరంగ సభ నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక సత్ర యాజమాన్యం, స్థానికులు, ఉద్యోగులు, మార్కెట్ దుకాణదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఉచిత బస్సు ఇంకెప్పుడు?

- ఏడాదిగా మహిళలు నిరీక్షణ
- సూపర్ సిక్స్ హామీని నెరవేర్చని కూటమి ప్రభుత్వం
- అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన



పల్లె వెలుగు బస్సు

బండి ఆత్మకూరు: ఎన్నికల సమయంలో ఎలాగైనా అధికారంలోకి రావాలని కూటమి నాయకులు సూపర్ సిక్స్ పేరుతో హామీలు గుప్పించారు. పేదల సంక్షేమమే తమ ధ్యేయమని, తమను గెలిపిస్తే ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తామని ఊదరగొట్టారు. తీరా అధికారంలోకి వచ్చాక పేదలను మరిచారు. సంక్షేమ పథకాల ఊసే ఎత్తకుండా రేపు మాపు అంటూ కాలయాపన చేస్తున్నారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని ప్రకటించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎప్పుడు అమలు చేస్తారా అని మహిళలు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. ఏడాది గడిచిపోతున్నా హామీని అమలు చేయకపోవడంపై మహిళలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వచ్చే ఆగస్టు నుంచి హామీని అమలు చేస్తామని ప్రభుత్వం చెబుతున్నా అప్పుడైనా అమలు చేస్తారో.. లేదోనని మహిళలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో ఓటర్లు, జనాభా వివరాలు..

మండలం	ఓటర్లు	జనాభా
ఆత్మకూరు	32,344	43733
బండిఆత్మకూరు	19,524	24751
మహానంది	15303	20120
శ్రీశైలం	11602	16064
వెలుగోడు	21820	24466

శ్రీశైలం నియోజకవర్గంలో 1,29,134 మంది మహిళలు

శ్రీశైలం నియోజకవర్గంలో 1,29,134 మంది మహిళలు, 1,00,593 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో కనీసం సగం మందికిపైగా పేద, దిగువ మధ్య తరగతికి చెందిన మహిళలే ఉన్నారు.

వీరంతా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తే ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని ఆశపడుతున్నారు. అయితే ఏడాది కావస్తున్నా ఇప్పటి వరకు ఇచ్చిన హామీ నెరవేర్చకపోగా సీఎం చంద్రబాబు తరచూ రాష్ట్ర ఆర్థిక ఇబ్బందుల గురించి మాట్లాడుతుండడంతో పథకం అమలుకు నోచుకుంటుందో, లేదోనని సందేహాన్ని వెలిబుచ్చుతున్నారు.

హామీని నెరవేర్చాలి



ఎన్నికల సమయంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని చంద్రబాబు చెప్పారు. మహిళల ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చాక హామీని విస్మరించారు. ఏడాది గడుస్తున్నా అదిగో.. ఇదిగో అంటూ మభ్యపెడుతున్నారు. ఇలా మోసం చేయడం తగదు.

– పల్లె నాగమణి, వెంగళరెడ్డిపేట

నమ్మి మోసపోయాం



ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని చంద్రబాబు నాయుడు చెప్పడంతో నమ్మి మోసపోయాం. ఇప్పుడు ఉచిత బస్సు ప్రయాణం అమలుపై అనుమానం కలుగుతుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఉచిత బస్సు ప్రయాణం హామీని నెరవేర్చకపోవడం దారుణం.

– సుధారాణి, లింగాపురం

ఇంజిన్ బోట్లు నడిపితే చర్యలు

పగిద్యాల: కృష్ణానది బ్యాక్ వాటర్ సమీపంలోని అర్లపాడు, మూర్వకొండ ఘాటు ప్రాంతాల నుంచి అనుమతి లేకుండా ఇంజిన్ బోట్లలో ప్రయాణికులను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ శివరాముడు హెచ్చరించారు. శుక్రవారం నెహ్రూనగర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఇంజిన్‌బోటు నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణానదికి వరద నీరు వచ్చి చేరుతుండటంతో ఇంజిన్ బోట్లు నడపరాదన్నారు. ఆదేశాలను బేఖాతరు చేస్తే బోట్లు సీజ్ చేసి నిర్వాహకులపై కేసులు నమోదు చేయించి, జైలుకు పంపుతామని హెచ్చరించారు.

కేసు నమోదు చేయాలి

శ్రీశైలంప్రాజెక్ట్: ఆదోని మండలం ఢణాపురం సర్పంచ్ దళిత చంద్రశేఖర్‌ను అవమానించిన ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ నాయకురాలు గుడిసె కిష్టమ్మపై ఎస్సీ అట్రాసిటీ కేసును నమోదు చేయాలని సీఐటీయూ నాయకులు మునిపాటి చిన్నమారెన్న, దర్శనం నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు సున్నిపెంటలో విలేకరులతో మాట్లాడుతూ దళిత సర్పంచ్‌ను ఆలయ ప్రాంగణంలోని స్టేజీపైకి పిలవకుండా అవమానించడం బాధాకరమన్నారు.

యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయండి

నందికొట్కూరు: అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ బేబి కోరారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఉదయం 6 గంటలకు అందరూ తప్పని సరిగా పట్టణ సమీపంలోని మార్కెట్ యార్డులో నిర్వహించే యోగాసన కార్యక్రమంలో పాల్గొనాలన్నారు.

- పాములపాడు: స్థానిక ఏపీ మోడల్ స్కూల్ ఆవరణంలో శనివారం నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేద్దామని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజిష్టర్ చేసిన ప్రతి ఒక్కరూ యోగా డేలో పాల్గొనేలా చూడాలన్నారు.
- వెలుగోడు: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. శనివారం అన్ని గ్రామాల్లో యోగా దినోత్సవం నిర్వహించాలని ఆయన సూచించారు. కార్యక్రమం నిర్వాహణపై ఒక్కో గ్రామానికి ఒక స్పెషల్ ఆఫీసర్‌కు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. అబ్దుల్లాపురం గ్రామానికి ఏపీఎం సుగుణపాల్, బోయరేవులకు ఏఓ స్వాతి, గుంతకందాలకు కోమలి, మోతుకూరు జయపాల్ రెడ్డి, మాధవరం నాగజ్యోతి, రేగడగూడూరుకు శ్రీనివాసులు, వెలుగోడుకు గంధం మురారి, వేల్పనూరుకు ఎం.శ్రీనివాసులును నియమించినట్లు ఎంపీడీఓ తెలిపారు.

ప్రయాణికుల సౌకర్యార్థం అలంపూర్‌కు ఆర్టీసీ బస్సు

నందికొట్కూరు: ప్రయాణికుల సౌకర్యార్థమే అలంపూర్‌కు ఆర్టీసీ బస్సు సర్వీస్‌ను కేటాయించామని డిపో మేనేజర్ నాగరాజు తెలిపారు. శుక్రవారం ఆర్టీసీ డిపోలో అలంపూర్‌కు బస్సు సర్వీస్‌ను డీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అలంపూర్‌లోని జోగుళాంబ పుణ్యక్షేత్రం అమ్మవారిని, షాషావలి దర్గాను, దర్శించుకునే ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సు సర్వీసు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఆది, మంగళ, శుక్రవారాల్లో నందికొట్కూరు ఆర్టీసీ డిపో నుంచి బ్రాహ్మణకొట్కూరు, కోళ్లబావాపురం, పూడూరు మీదుగా బస్సులను నడుపుతామన్నారు. బస్సు టికెట్ ధర రూ.30లు మాత్రమేనన్నారు. ఉదయం 6 నుంచి రాత్రి 8 గంటలకు వరకు ఆర్టీసీ బస్సును తిప్పుతామన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జాయింట్ ఎల్‌పీఎం సమస్యను పరిష్కరించుకోండి

పాములపాడు: జాయింట్ ఎల్‌పీఎం సమస్యతో ఇబ్బందులెదుర్కొంటున్న రైతులు అర్జీలు ఇచ్చి సమస్యను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ సుభద్రమ్మ తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో కొందరి రైతుల భూములు జాయింట్ ఎల్‌పీఎం నమోదు కావడంతో రైతులు ప్రభుత్వ పథకాలకు అనర్హులుగా మిగులుతున్నారన్నారు. సమస్య పరిష్కారం కోసం రైతులు మండల సర్వేయర్, రీ సర్వే డీటీ, తహసీల్దార్‌లలో ఎవరినైనా సంప్రదించి సమస్యపై అర్జీ ఇవ్వాలన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

పాములపాడు: మండలంలోని కొత్త బాణకచర్ల గ్రామానికి చెందిన గుండ్రాల శివుడు అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా శుక్రవారం ఎస్ఐ సురేష్ బాబు తన సిబ్బందితో కలిసి దాడి చేసి అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 79 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

మహిళ ఆత్మహత్య

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని ఎర్రగుంట్ల గ్రామంలో శుక్రవారం మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన లక్ష్మిదేవి(27) తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి దిగులుతో ఉన్న లక్ష్మిదేవి గురువారం రాత్రి ఇంటిలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ధరలు కన్పించేలా బోర్డులు ఏర్పాటు చేయాలి

మహానంది: ఆలయాల్లో టెండర్ల ద్వారా వివిధ దుకాణాలు దక్కించుకున్న చోట, ఇతర విభాగాల వద్ద దేవస్థానం నిర్ణయించిన ధరలు స్పష్టంగా కనిపించేలా బోర్డులు ఏర్పాటు చేయాలని, ఆలయ ముఖద్వారం నుంచి దర్శనం వరకు వెళ్లే అన్ని చోట్ల భక్తులకు కన్పించేలా చర్యలు తీసుకోవాలని దేవదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్ ఆదేశించారు. కమిషనర్ ఆదేశాల మేరకు మహానంది దేవస్థానం కార్యాలయంలో ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి, ఏఈఓ ఎరమల మధు ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేసినట్లు కార్యాలయ వర్గాలు తెలిపాయి.

ప్రజల ఆదరాభిమానాలు పొందాలి



కేకు కట్ చేస్తున్న తహసీల్దార్ రత్నరాధిక



కేక్ కట్ చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాస గౌడు

ఆత్మకూరు: ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించి వారి ఆదరాభిమానాలు పొందాలని తహసీల్దార్ రత్నరాధిక రెవెన్యూ సిబ్బందికి సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూ సమస్యలు, రెవెన్యూ పరమైన సర్టిఫికెట్లు, ఇతర భూ తగాదా తదితర సమస్యలతో వచ్చే ప్రజలకు సత్వరమే పరిష్కారం చూపితే వారు ఎంతో సంతోషిస్తారన్నారు. ప్రతి అధికారి అంకితభావంతో పని చేయాలన్నారు. అంతకుముందు రెవెన్యూ అధికారులు కార్యాలయాన్ని అలంకరించి, కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మనోహర్, సీనియర్ అసిస్టెంట్ మౌలాలి, రమణ, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఘనంగా రెవెన్యూ దినోత్సవం

వెలుగోడు: రెవెన్యూ దినోత్సవాన్ని శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాసగౌడు, రెవెన్యూ సిబ్బంది కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రెవెన్యూ వ్యవస్థ ప్రజలకు అందించే సేవల ప్రాముఖ్యతను తహసీల్దార్ వివరించారు. వేడుకల్లో డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ వెంకట్రామిరెడ్డి, వీఆర్ఓలు మహబూబ్‌బాషా, సుగుణాకర్, చక్రి, అన్వర్, వేణుగోపాల్, జగదీష్ పాల్గొన్నారు.

అర్హులందరికీ తల్లికి వందనం వర్తింపజేయాలి



ధర్నా చేస్తున్న గుంతకందాల గ్రామస్తులు

వెలుగోడు: అర్హులందరికీ తల్లికి వందనం పథకం వర్తింపజేయాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు గుంతకందాల గ్రామస్తులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాయలసీమ విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ జిల్లా ఉపాధ్యక్షుడు మోతే శివశంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం పథకం లబ్ధిదారుల ఎంపికలో రీ సర్వేను సాకుగా చూపడం సరికాదన్నారు. జాయింట్ ఎల్‌పీఎంల కారణంగా చాలా మంది పథకానికి దూరమయ్యారన్నారు. ఉన్నతాధికారుల స్పందించి జాయింట్ ఎల్‌పీఎంల సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు వి నాగరాజు, వి పెద్ద రాములు, శివలింగం, లక్ష్మీదేవి, లతా, రామకృష్ణ, శ్రీకాంత్, పెదబాబు, రాజా, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

నందికొట్కూరు: ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎండీ రఫీ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని పటేల్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలు, కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలను తుంగతో తొక్కి ఇష్టానుసారంగా ఫీజు వసూలు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. స్పెషల్ ఫీజు, స్కూల్ డే, వార్షికోత్సవం పేర్లతో అదనంగా డబ్బు వసూలు చేస్తున్న స్కూళ్లపై విచారించి చర్యలు తీసుకోవాలని, తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు షాహిద్, జయకర్, విజయ్, తరుణ్, సందీప్, రాజేష్, నవీన్, వినోదు పాల్గొన్నారు.

ఘనంగా రెవెన్యూ దినోత్సవం





రిటైర్డ్ ఆర్ఐ సుధామూర్తిని సన్మానిస్తున్న దృశ్యం, విశ్రాంత రెవెన్యూ అధికారులను సన్మానిస్తున్న అధికారులు

కొత్తపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రిటైర్డ్ ఆర్ఐ సుధామూర్తి, తహసీల్దార్ ఉమారాణిని రెవెన్యూ సిబ్బంది సన్మానించారు. అంతకుముందు. రెవెన్యూ దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న పాల్గొన్నారు.

విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులకు సన్మానం

ఆత్మకూరు: రెవెన్యూ దినోత్సవం సందర్భంగా స్థానిక రెవెన్యూ డిజిటల్ కార్యాలయంలో విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులు, తహసీల్దార్‌లు సిరాజుద్దీన్, రామకృష్ణ, మహబూబ్, డిప్యూటీ తహసీల్దార్ గోవిందరెడ్డిలను ఆర్డీఓ నాగజ్యోతి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ పరిపాలనలో రెవెన్యూశాఖ కీలకమన్నారు. రెవెన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీఈఓ శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్‌లు రామచంద్రరావు, షానవాజ్, డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ నాగరాజు పాల్గొన్నారు.

పని గంటల పెంపు దుర్మార్గపు చర్య



శ్రీశైలంప్రాజెక్ట్: కార్పొరేట్‌లకు తొత్తులుగా మారి, కార్మికుల శ్రమను దోపిడీ చేయడానికి పని గంటలను పెంచుతూ కేంద్రం చట్టం తీసుకురావడం దుర్మార్గపు చర్య అని ఏఐటీయూసీ నాయకుడు కె.నాగిరెడ్డి విమర్శించారు. కార్మికులను అణగదొక్కేలా ఉన్న చట్టాలను రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా బ్రిటీష్ ప్రభుత్వంతో పోరాడి 8 గంటల పని విధానాన్ని కార్మిక సంఘాలు సాధించుకున్నాయన్నారు. నేడు కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడవడం తగదన్నారు. చట్టాలను రద్దు చేసేంతవరకు పోరాడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు అన్వర్‌బాషా, శంకర్, మత్తేష్, ప్రసాదు, టి.మల్లికార్జున, గంగాధర్, నరసింహ, మల్లికార్జున, లక్ష్మయ్య, రాజయ్య, వలి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- ఆత్మకూరు: పని గంటల పెంపును వ్యతిరేకిస్తూ శుక్రవారం సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్ ఆధ్వర్యంలో ఆత్మకూరులో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు పని గంటలు పెంచుతూ కేబినేట్‌లో తీర్మానిస్తూ జీఓ జారీ చేయడం తగదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మాబాషా, హుసేన్‌బాషా, రఫీ, మియాస, మౌలాలి, ముర్తుజా, అస్లాం, నరసింహ పాల్గొన్నారు.

తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందిస్తున్న కార్మికసంఘాల నాయకులు

మహానందీశుడి దంపతులకు పల్లకీసేవ



మహానందిలో పల్లకీసేవ దృశ్యం



మహానందిలో దర్శకుడు టి.ప్రశాంత్, మిత్రబృందం

మహానంది: మహానందిలో కొలువైన కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు శుక్రవారం రాత్రి ఆలయ ఇన్‌స్పెక్టర్ పి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, వేదపండితులు, అర్చకులు పల్లకీసేవ నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను అలంకార మండపంలో కొలువు తీర్చి గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, మహా మంగళహారతులు ఇచ్చారు. అనంతరం ఆలయ ప్రాకారాల్లో పల్లకోత్సవం నిర్వహించారు.

మహానందిలో సినీ దర్శకుడు ప్రశాంత్‌రెడ్డి పూజలు

సినీ దర్శకుడు టి.ప్రశాంత్ రెడ్డి శుక్రవారం మహానందీశ్వర స్వామిని, కామేశ్వరి మాతను దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహానంది ఆలయ పరిసరాలు అద్భుతంగా ఉన్నాయన్నారు. ఇక్కడ మహానంది సినిమాతో పాటు ఎన్నో విజయవంతమైన చిత్రాలు షూటింగ్ జరుపుకున్నాయన్నారు.

పల్లెల్లో చీకట్లు



కరెంట్ కోసం ఎదురుచూస్తున్న గువ్వలకుంట్ల ప్రజలు

కొత్తపల్లి: మండలంలోని పల్లెల్లో సాయంత్రమైతేనే చీకట్లు కమ్ముకుంటున్నాయి. విద్యుత్ లైన్ల పనుల పేరుతో కోతలు విధిస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోరోజు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు కూడా కరెంట్ రావడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారులకు ఫోన్ చేసినా స్పందించరని, ఎప్పుడు కరెంట్ వస్తుందో, ఎప్పుడు పోతుందో అర్థం కావడం లేదని ప్రజలు వాపోతున్నారు.

వాహనాల తనిఖీ

మహానంది: మండల పరిధిలోని గాజులపల్లె, బోయిలకుంట్ల మెట్ట తదితర గ్రామాల పరిధిలో శుక్రవారం ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి వాహనాల తనిఖీ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని డ్రైవర్లకు సూచించారు.

● యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం



యోగాసానాలు వేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జాతీయ మైనార్టీ మోర్చా కార్యవర్గ సభ్యురాలు మోమిన్‌షభానా అన్నారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో పాల్గొని యోగాసానాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగాతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసికంగా ఆరోగ్యంగా ఉంటామన్నారు. ప్రతిఒక్కరూ యోగాసనాలు చేయాలని, దినచర్యలో భాగంగా యోగా చేయాలని సూచించారు.

ఆత్మకూరులో ఓ మోస్తరు వర్షం



ఆత్మకూరులో కురుస్తున్న వర్షం

ఆత్మకూరు: ఆత్మకూరు మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో శుక్రవారం చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షం కురిసింది. పది రోజుల నుంచి వర్షాలు లేకపోవడంతో పత్తి, మొక్కజొన్న, కంది, వరి తదితర పైర్లు ఎండుదశకు చేరాయి. ఈక్రమంలో వర్షం కురవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.